# విద్యా వారోత్సవం.. అంతా సిద్ధం



జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన మేకర్స్ స్పేస్

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** విద్యా వారోత్సవాలకు కళాశాలలు, పాఠశాలలు సిద్ధమయ్యాయి. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాలలో విద్యాభివృద్ధి.. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి.. వారికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు. వర్సిటీ నుంచి కళాశాలలు.. పాఠశాలలన్నింటిలోనూ ప్రత్యేక కార్యక్రమాలతో కూడిన షెడ్యూల్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నప్పటికీ.. వారోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందరితో పాటు అందుబాటులో ఉండే విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో విద్యా వారోత్సవాల ఏర్పాట్లలో అన్ని విద్యాసంస్థల విద్యాధికారులు తలమునకలై ఉన్నారు.

## నైపుణ్యాభివృద్ధిపై దృష్టి

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో జేఎన్‌టీయూ, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలు వారం రోజుల పాటు నిరవధికంగా కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా జేఎన్‌టీయూలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే దిశగా పలు ఒప్పందాలు.. కోర్సులను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. జేఎన్‌టీయూ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్‌లో(జేటీబీఐ) నూతనంగా ఏర్పాటు చేసిన మేకర్స్ స్పేస్, ఈవెంట్స్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ) నుంచి సమకూరిన నిధులతో జేటీబీఐలో కొత్తగా విద్యార్థుల కోసం సమకూర్చిన కొన్ని స్టార్టప్‌లకు ఉపయోగకరమైన పరికరాలను ప్రారంభించనున్నారు. స్టార్టప్‌ల ఆలోచనలను సిద్ధం చేసిన విద్యార్థులకు తదుపరి కార్యాచరణలోకి వెళ్లేందుకుగాను ప్రత్యేకంగా పరిశ్రమల నిర్వాహకులతో కార్యక్రమాలను రూపొందించారు. అలాగే ఉద్యోగులు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీన స్టార్టప్‌ల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.